జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నల్గొండ

సూర్యాపేట - యాదాద్రి భువనగిరి

సోమవారం 14 సెప్టెంబర్ 2026 పేజీలు:10

విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- ప్రశాంత వాతావరణంలో నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి- ప్రజలందరికి వినాయకచవితి శుభాకాంక్షలు- మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి):

విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరు కుంటూ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంట కండ్ల జగదీష్ రెడ్డి ప్రజలం దరికి వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఐక్యతతో పాటు భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నవ రాత్రి వేడుకలను జరుపు కోవాలని కోరారు.

వివరాలు 2లో

ప్లాస్టిక్ గణపతి వద్దు... మట్టి గణపతే ముద్దు...

- ఫోటో రైటప్ ఐమట్టి గణపతి ఫోటో

నిడమనూరు, సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి):

ప్రతి ఒక్కరూ పూజించే గణనాథుల పండుగ వచ్చేసింది. ఈ నెల 13న వినాయక చవితి పండుగ, వయస్సుతో సంబంధం లేకుండా కులాలకు అతీతంగా అందరూ ఉత్సాహంగా నిర్వహించే పండుగ వినాయక చవితి. ప్రతి ఏడాది లెక్కకు లేనన్ని వినాయకులను ప్రతిష్టించి 3 రోజుల నుంచి 16 రోజుల వరకు పూజించే పండుగ ఇది. - మిగతా 2 లో..

391 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం:

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 391 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను బీర్ల అయిలయ్య గారు అందజేశారు.ఈ సందర్భంగా మండలాల వారీగా చెక్కుల వివరాలు ఇలా ఉన్నాయి. - మిగతా 2 లో..

దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ, సెప్టెంబర్ 13, (ప్రజా జ్యోతి) :

దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విఘ్నాలకు అధిపతి, సకల దేవగణాలకు నాయకుడు, తొలిపూజ అందుకునే ఆదిదేవుడు శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.భాద్రపద మాసం శుక్ల పక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా వినాయక చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. వినాయకుడిని భక్తితో ప్రార్థించడం ద్వారా సకల ఆటంకాలు తొలగి, చేపట్టిన ప్రతి కార్యం విజయవంతం అవుతుందని, ప్రజలందరికీ ఆనందమయ జీవితం లభించాలని కోరారు. విద్య, విజ్ఞానం, వివేకం, వినయాన్ని ప్రసాదించే గణనాథుడి కృపతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.విఘ్నాలను తొలగించి సకల అభీష్టాలను నెరవేర్చే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం ఎల్లవేళలా సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు రవీంద్ర కుమార్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహించే నవరాత్రి ఉత్సవాలను భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో, అత్యంత ప్రశాంత వాతావరణంలో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు.

విఘ్న గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మొదటిపేజీ తరువాయి

ఇక నుండైనా విఘ్నాలన్నీ తొలగి తెలంగాణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు.ఏక దంతుడి దీవెనలతో ప్రజలంతా శాంతి సౌభ్రాతృత్వాలు వెల్లి విరిసేలా గణపతి నవరాత్రోత్సవాలు జరుపు కోవాలని విజ్ఞప్తి చేశారు. వాడవాడలా తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసిన మండపాలవద్ద తగుజాగ్రత్తలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు.

391 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి

బొమ్మలరామారం మండలం 60 చెక్కుల, తుర్కపల్లి మండలం 30 చెక్కుల, రాజాపేట మండలం 33 చెక్కుల,యాదగిరిగుట్ట మండలం 82 చెక్కులు,మోటకొండూరు మండలం 33 చెక్కులు, ఆలేరు మండలం 39 చెక్కులు,ఆత్మకూరు మండలం 44 చెక్కులు, గుండాల మండలం 33 చెక్కులు,హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు 37 చెక్కులుఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తూ వారి కష్టాల్లో తోడుగా ఉంటోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు సహా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా ప్రయోజనం కలుగుతోందన్నారు.ఆలేరు నియోజకవర్గంలో కూడా సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీర్ల అయిలయ్య హామీ ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కి కృతజ్ఞతలు తెలిపారు. తమ వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించడం వల్ల ఎంతో ఊరట లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులే మేలు

- ఎన్జీ కళాశాల వద్ద ఎంఎస్ న్యూస్ ఛానల్ ఆధ్వర్యంలో ఉచిత పంపిణీ..

కార్యక్రమాన్ని ప్రారంభించిన.. - నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి

నల్లగొండ సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి):

వినాయక చవితి సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల వద్ద ఎంఎస్ న్యూస్ ఛానల్ ఎండీ బైరోజు మహేష్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి మట్టి గణపతుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు సహజమైన మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని సూచించారు. రసాయన రంగులతో తయారైన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు.యువత, మహిళలు, పేదల కోసం సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న బైరోజు మహేష్‌ను అతిథులు అభినందించారు. అనంతరం మహేష్ ముఖ్యఅతిథులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పుల్లారావు, డాక్టర్ పి.వి.ఎన్. మూర్తి, టూ టౌన్ ఎస్ఐ సైదాబాబు, ట్రాఫిక్ ఎస్ఐ విజయభాయి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టీక్ గణపతి వద్దు... మట్టి గణపతే ముద్దు...

మొదటిపేజీ తరువాయి

కానీ భౌగోళిక శాస్త్రవేత్తల ఆందో ళనలు నేడు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. పూర్వకాలం కాకతీయుల కాలంలో బయటపడిన రాతి విగ్ర వినాయక విగ్రహాలు అక్కడే పూజలు అందుకొని ఎవరికి హామీ కలుగకుండా ఉండేది. కాలక్రమేన మట్టి విగ్రహాలు అందుబాటులోకి వచ్చాయి. వర్షాకాలం మధ్యలో వచ్చే ఈ వినాయకుడి పండుగ చెరువులు కుంటలు, వాగులు, వర్షాలతో నిండి మట్టితో తయారు చేయబడే ఈ విగ్రహాలు ప్రకృతికి ఎంతో ప్రయోజనం కలిగించి ఉంటాయని పలువురు తెలిపారు. ప్రకృతి ప్రియులు అభిప్రా యపడు తున్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత మట్టి వినాయకుల పూజించే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. ఊరుకో వినాయకుడు పెట్టి శబ్ద కాలుష్యాన్ని తగ్గించాలని పలు వురు కోరారు. మనం వాడే ప్రతి వస్తు నేడు రసాయనతో కూడినై ఉంటున్నాయి. ఇప్పటికైనా అందరూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణపతులను వద్దని మట్టి వినాయకులకు జేజేలు పలుకుతూ పూజలు చేద్దామని ఆశిద్దాం.

విద్యుత్తు కోతలపై తెలంగాణ పల్లెల్లో ఉద్యమ జ్వాల కాంగ్రెస్ సర్కార్‌పై

మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆగ్రహం

దేవరకొండ, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి) :

తెలంగాణ పల్లెల్లో కరెంట్ కోతలతో రైతాంగం తీవ్ర గోస పడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై పల్లెలు ఉద్యమ బాట పట్టాయని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన నిరంతరాయ ఉచిత విద్యుత్ హామీ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కరెంట్ కష్టాలతో రైతులు విలవిలలాడుతున్నారు. కనీసం 7 గంటల కరెంట్ కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ సర్కార్ ఉంది. అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజ్ సమస్యల వల్ల పొలాలకు నీరందక పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు గుండె కోత అనుభవిస్తున్నారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోని ఈ మొండి ప్రభుత్వానికి రైతుల ఆగ్రహ జ్వాలల్లో భస్మం కాక తప్పదు అని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలపై రైతుల పోరుబాట పడ్డారని, సబ్‌స్టేషన్ల ముట్టడులు, ధర్నాలు, రాస్తారోకోలతో పల్లెలు రగులుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైతాంగానికి అండగా నిలిచిన విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, కరెంట్ కోతలతో అన్నదాతలను ఇబ్బంది పెడుతున్న ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తిరస్కరించడం ఖాయమని రమావత్ రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు. రైతుల పొలాలకు వెంటనే నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు.

అన్నమయ్య కళా సమితి అవార్డుల ప్రదానం

విద్యావేత్త డాక్టర్ నల్గొండ రమేష్,

జానపద కళాకారుడు

డప్పు పాపయ్యకు పురస్కారాలు

నల్లగొండ సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)

హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అన్నమయ్య కళా సమితి ఫౌండేషన్ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన 11 మంది ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు.శాలిగౌరారం మండలం అడ్లూరు గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, పెరక కొండారం పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న డాక్టర్ నల్గొండ రమేష్‌కు విద్యా రంగంలో పురస్కారం లభించింది.అదేవిధంగా శాలిగౌరారం మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు డప్పు పాపయ్యకు జానపద కళారంగంలో విశిష్ట సేవలకు అవార్డు అందించారు.ప్రముఖ సినీ నటుడు, రాజకీయవేత్త బాబు మోహన్ చేతుల మీదుగా డాక్టర్ నల్గొండ రమేష్, డప్పు పాపయ్య అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ పూల సతీష్" పోలగోని సర్వయ్య, డాక్టర్ సందీప్, నిమ్మల వీరాస్వామి, పలువురు ప్రముఖులు వారిని అభినందించారు.

సీతారాం ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- చింతపల్లి బయన్న సీపీఎం మండల కార్యదర్శి

నార్కట్ పల్లి, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):

సిపిఐ (ఎం) అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు, ప్రజా ఉద్యమాల స్ఫూర్తిదాత కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నార్కెట్ పల్లి మండల కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవన్ లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ... సీతారాం ఏచూరి జీవితాంతం కార్మికులు, కర్షకులు, పేదలు, సామాన్య ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడారని అన్నారు. భారతదేశంలో లౌకిక, ప్రజాస్వామ్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశంలో మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజా ఐక్యతను నిర్మించడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పార్లమెంటరీ రాజకీయాలతో పాటు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడంలో ఆయన చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలు మరియు విద్యార్థుల సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే సీతారాం

ఏచూరికి నిజమైన నివాళి అని అన్నారు. సీతారాం ఏచూరి చూపిన ప్రజా పోరాటాల మార్గంలో పయనిస్తూ, దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం మరియు సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సీతారాం ఏచూరి ఆశయాలను సాధిద్దా మన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు చెరుకు పెద్దులు, కుమ్మరి శంకర్, కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య,దండు రవి,అర్థం శ్రీను,మంద గిరి, మంద గోపాలు, దుర్గయ్య, మహేష్,నరసింహ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుపాక ముదిరాజు సంఘం బోల్ల బోని

- తోట అధ్యక్షుడిగా సత్యనారాయణ

ఆలేరు సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక ముదిరాజు సంఘం బోల్ల బోని తోట నూతన కమిటీని సంఘం కుల పెద్దమనిషి పారుపల్లి వెంకటేష్, గౌరవ అధ్యక్షులు చాడ నాగరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ నిర్వహించగా అధ్యక్షుడిగా చాడ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా దాసరి ఆంజనేయులు, యాట ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా గుర్రాల బాలరాజు, సహాయ కార్యదర్శిగా నేరెళ్ల శంకర్, అంకిరెడ్డి శీను, తోడేటి నరేందర్, కోశాధికారిగా దేగల శ్రీకాంత్, ఉపకోషాధికారిగా గుర్రాల మహేందర్, ముఖ్య సలహాదారులు మాటూరి నర్సింలు, గడ్డం శంకర్, చాదరాజు, మామిళ్ళ ఉప్పలయ్య గుర్రాల బాలకృష్ణ నేరేళ్ల సోమరాజు, నేరెళ్ల రాజు లు ఎన్నికయ్యారు ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుర్రాల రమేష్, యాట వెంకటేష్, గుర్రాల శ్రీను, కర్రె సునీల్, చింతల రామచంద్రం, దాసరి శ్రీకాంత్, పారుపల్లి శ్రీను, యాట ఉపేందర్, చొప్పరి శేఖర్, దేగల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కరోలీన్ చింగ్ తీయాన్ మావి ఐఏఎస్

- పోలింగ్ కేంద్రాల్లో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 13,(ప్రజాజ్యోతి):

ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా కొండమల్లేపల్లి, గుమ్మడవల్లి పోలింగ్ కేంద్రాలను దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ కరోలీన్ చింగ్ తీయాన్ మావి ఐఏఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో ఎన్నికల ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న నోటీసులు, విచారణ ప్రక్రియ, ఫొటోల అప్‌లోడ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లతో మాట్లాడి చేంజింగ్ ఎస్ఐఆర్ ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓటరుగా నమోదు అయ్యారా నమోదు విషయంలో ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో దేవరకొండ అసెంబ్లీ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, సూపర్‌వైజర్లు ఆర్ఐ శ్రీను, జేఏలు శ్రీను, సంగీత, బీఎల్‌వోలు సత్యం, కమల, శోభ, జ్యోతి, వెంకటమ్మ, నారాయణ, రతన్‌లాల్, సీసీ హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి 200 గజాల స్థలం విరాళం - భర్త జ్ఞాపకార్థం భార్య నర్మద సేవా నిర్ణయం

- లక్షల విలువైన భూమిని గ్రామాభివృద్ధికి అందజేత

అనంతగిరి(ప్రజా జ్యోతి) న్యూస్ సెప్టెంబర్ 13 2026

అనంతగిరి మండలంలోని అజ్మీర తండా గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణం కోసం కంపాని రామారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి నర్మద 200 గజాల స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రామస్థుల సమక్షంలో స్థలానికి సంబంధించిన పత్రాలను పంచాయతీ ప్రతినిధులకు అందించారు. లక్షల రూపాయల విలువైన స్థలాన్ని గ్రామ అభివృద్ధి కోసం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని సర్పంచ్ అజ్మీర శ్రీవిద్య బాలకృష్ణ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి స్థలం సమకూరడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైందన్నారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీ మరింత అభివృద్ధి చేసేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నర్మదను సర్పంచ్‌తో పాటు మాజీ ఎంపీటీసీ గింజుపల్లి రమేష్ అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద అప్రమత్తతే భద్రత

- మున్సిపల్ వైస్ చైర్మన్ రాజారమేష్ యాదవ్

హాలియా, సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి):

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని హాలియా మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజారమేష్ యాదవ్ సూచించారు.ఆదివారం హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించి, ఉత్సవ కమిటీ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. మండపాల ఏర్పాటులో ప్రభుత్వ నిబంధనలు పాటించడంతో పాటు,ప్రమాదాలు జరగకుండా విద్యుత్ వైర్లు,పరికరాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఉత్సవాల సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బందికి, పోలీసు మరియు విద్యుత్ శాఖ అధికారులకు నిర్వాహకులు,భక్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.భక్తిభావంతో ఉత్సవాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటూనే, ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

కూతురే కొడుకై.. కన్నతండ్రికి తలకొరివి

- కుమారుడు లేని లోటును తానే పూడ్చి, కన్నతండ్రికి తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకుంది

మల్లేపల్లి, సెప్టెంబర్ 13,(ప్రజాజ్యోతి):

మండల కేంద్రంలో గుమ్మడవల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి యాదయ్య అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు కుమారుడు లేకపోవడంతో పెద్ద కుమార్తె నవ్య తండ్రి అంత్యక్రియల్లో ముందుండి బాధ్యతలు నిర్వర్తించి కుమారుడు లేని లోటును తానే పూడ్చి, కన్నతండ్రికి తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకున్నారు. చివరగా తండ్రికి తలకొరివి పెట్టి కడసారి వీడ్కోలు పలికారు.తండ్రిని చివరి మజిలీకి సాగనంపుతున్న సమయంలో నవ్య కన్నీటి పర్యంతమైన తీరు అక్కడున్న వారిని కదిలించింది. జన్మనిచ్చిన తండ్రికి చివరి కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో కొడుకుతో తాను ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించారు.కూతురంటే భారంగా భావించే ఆలోచనలకు చెంపపెట్టు కూతురంటే తండ్రి గుండెల్లో దాచుకునే ధైర్యం, అవసరమైతే కొడుకై నిలిచే బాధ్యత అని చాటిన నవ్య.కూతురు కూతురే కాదు తల్లిదండ్రులకు అవసరమైనప్పుడు కొడుకై నిలబడే కొండంత అండ అనే సందేశాన్ని ఈ ఘటన చాటిచెప్పింది.

శాలిగౌరారం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఇందనూరు శ్రీను

నల్లగొండ సెప్టెంబర్ 13 (ప్రజాజ్యోతి ప్రతినిధి)

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఇందనూరు శ్రీను నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలును మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. తనపై నమ్మకంతో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మందుల సామేలు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందుల సూర్యకిరణ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, మాజీ జడ్పీటీసీ నోముల వెంకన్న, శాలిగౌరారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పరశురాములు తదితరులకు ఇందనూరు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.మండలంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకుల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇందనూరు శ్రీను పేర్కొన్నారు.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

- వినాయక మండపాల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి):

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించగలమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పండుగను జరుపుకోవాలని కోరారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, తద్వారా పర్యావరణంతో పాటు ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి వార్డుకు రెండు చొప్పున ఐదు అడుగుల మట్టి విగ్రహాలతో పాటు కాలుష్య నియంత్రణ మండలి అందించిన చిన్న మట్టి విగ్రహాలను కలిపి మొత్తం 1,000 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మండపాల వద్ద పరిశుభ్రతకు ప్రాధాన్యం

వినాయక మండపాల నిర్వాహకులు పర్యావరణ పరిరక్షణతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నివేదిత లక్ష్మాది సూచించారు.మండపాల పరిసరాల్లో చెత్తను రోడ్లపై వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని,చెత్త సేకరణకు వచ్చే మున్సిపల్ ట్రాక్టర్ సిబ్బందికి అందజేయాలని కోరారు.పారిశుద్ధ్య సిబ్బందితో మండపాల కమిటీ సభ్యులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని ఆమె కోరారు. ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రణయ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ

అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న, కౌన్సిలర్లు జ్యోతి, శ్రీవిద్య, కరుణాకర్, పోలగాని మాధవి, కృష్ణ, రాపర్తి భవాని, శ్రీనివాస్, గుణగంటి హేమ, సతీష్, నాగుల వాసు, కొణతం రాజేష్, బత్తుల మంగమ్మ వెంకన్న, పిట్టల భవాని, రమేష్, గండూరి రమేష్, పిడమర్తి కీర్తి, లవన్, ఇందుశ్రీ, అనిల్, ఎలుగురి ఇందిరా వెంకన్న, మున్సిపల్ సిబ్బంది ఎం.డి. గౌసుద్దిన్, ఎస్.ఎస్.ఆర్. ప్రసాద్, యాదగిరి, అజిముద్దిన్, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

ఏఎన్ఆర్ ఫిల్టర్ కేఫ్ ప్రారంభించిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

చివ్వెంల సెప్టెంబర్ 13(ప్రజాజ్యోతి):

చివ్వెంల మండలం ఎంజీ నగర్ తండ గ్రామ పంచాయతీ సమీపంలోని జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఏఎన్ఆర్ ఫిల్టర్ కేఫ్ ను ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఫ్ నిర్వాహకులు దేవరకొండ సాయికి వారు శుభాకాంక్షలు తెలిపారు.వినియోగదారులకు నాణ్యమైన ఆహారం,మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెట్టే యువతను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి,చిలుముల సునీల్ రెడ్డి, ఆత్మకూర్(ఎస్) మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు రామచంద్రారెడ్డి,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్,శ్రీ దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి,జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం,సుజిత్ రెడ్డి,గాయం వారి గూడెం సర్పంచ్ జ్యోతి రాము నాయక్,ఉపసర్పంచ్ మణెమ్మ శ్రీను,సీనియర్ నాయకులు కలకోట్ల సంజీవ,వరప్రసాద్,జెర్రిపోతుల మధు, బాబు,రమేష్,అనిల్,సతీష్,జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకన్న,జమండ్ల సత్యనారాయణ రెడ్డి,మొగదాల లక్ష్మణ్ గౌడ్,నాగు నాయక్,మద్దెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం!

హాలియా,సెప్టెంబర్13(ప్రజా జ్యోతి):

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా హాలియా పట్టణ కేంద్రంలో 'గరుడ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉంటూ, పర్యావరణహితమైన మట్టి విగ్రహాలనే పూజించాలని భక్తులను కోరారు.ఈ కార్యక్రమానికి హాలియా క్లబ్ అధ్యక్షుడు పొట్టుమత్తు వెంకటేష్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై,తొలి మట్టి విగ్రహాన్ని స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోరి గరుడ ఫౌండేషన్ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని అభినందించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇలాంటి ఆదర్శవంతమైన సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.మట్టి విగ్రహాలను పూజించడం వల్ల జల వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవచ్చని,ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించి ప్రకృతి రక్షణకు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రెడ్డి, ప్రసాద్,సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి.. సిఐ

– డీజేలపై పూర్తి నిషేధం సీఐ చరమంద రాజు

హుజూర్ నగర్ సెప్టెంబర్ 13 (ప్రజా జ్యోతి)

వినాయక చవితి పండుగను హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ చరమంద రాజు పిలుపునిచ్చారు. ఆదివారం హుజూర్ నగర్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో కలిసి విడుదల చేసిన ఒక వీడియో ద్వారా ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మట్టి గణపతులకే ప్రాధాన్యం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ రసాయన రంగుల విగ్రహాలకు బదులుగా మట్టి వినాయకులనే పూజించాలన్నారు.నీటి కాలుష్య నివారణ: వర్షాభావం వల్ల చెరువులు, కుంటల్లో నీటి మట్టం తగ్గింది. రంగుల విగ్రహాల వల్ల నీరు కలుషితమై తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

డీజేలపై నిషేధం

శబ్ద కాలుష్య నివారణకు డీజే లను హుజూర్ నగర్ నియోజకవర్గం పూర్తిగా నిషేధించారు. మండపాల వద్ద ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిబంధనల అమలు

జిల్లా ఎస్పీ నరసింహ జారీ చేసిన అన్ని మార్గదర్శకాలను మండప నిర్వాహకులు తు.చ. తప్పకుండా పాటించి పోలీసులకు సహకరించాలి.ఈ కార్యక్రమంలో పాలకవీడు ఎస్ఐ కోటేష్, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, గరిడేపల్లి ఎస్ఐ శ్రీకాంత్, మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన దైద రవీందర్

కేతేపల్లి, సెప్టెంబర్ 13: ప్రజా జ్యోతి

నకిరేకల్ నియోజకవర్గంలోని కేతేపల్లి మండలం చీకటి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బుర్రి నరేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.అదేవిధంగా కొర్లపాడు గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు మాధగొని మహేష్ గౌడ్ అమ్మమ్మ తండు చంద్రమ్మ మృతి చెందడంతో ఆమె మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గార్లపాటి రవీందర్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి కోట పుల్లయ్య, మాజీ జెడ్పీటీసీ వెంకట నర్సయ్య, మాజీ ఎంపీటీసీ నర్మద నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, కుమ్మరి నాగయ్య, కొర్లపాడు గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు భయ్యా అంజయ్య యాదవ్, సీనియర్ నాయకులు బీరోల్ ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అమృత రెడ్డి, లింగరాజు, నల్లపు లింగయ్య, బుద్దే గణేష్, అప్పని లింగయ్య, కోట సైదయ్య, రామలింగయ్య, సాయి, బుర్రి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కోమటికుంటలో మంచినీటి సమస్యకు చెక్

- కొత్త బోరు మోటార్ ప్రారంభం

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రాథమిక అవసరాలకే ప్రాధాన్యం

- ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి):

సూర్యాపేట పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు శక్తిమేర కృషి చేస్తున్నామని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి అన్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 2వ వార్డు కోమటికుంటలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొత్త బోరు మోటార్‌ను ఆదివారం ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొరిశెట్టి లక్షాది ప్రారంభించారు.ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ కోమటికుంటలో ఇప్పటికే మూడు బోర్లు ఉన్నప్పటికీ వాటి నుంచి తక్కువ స్థాయిలో నీరు వస్తుండటంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికుల సమస్యను దృష్టిలో పెట్టుకుని నాలుగో బోరును ఏర్పాటు చేసి, దానికి కొత్త మోటార్‌ను అమర్చినట్లు చెప్పారు.కొత్త బోరు ద్వారా లభించే నీటిని 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌కు అనుసంధానం చేసి, ప్రజలకు నిత్యం తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలనీలో ఇప్పటికే ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉన్నాయని, మరో 700 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేస్తే మరింత మంది ప్రజలకు తాగునీటిని అందించవచ్చని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మంచినీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు ప్రజల ప్రాథమిక అవసరాలని, వాటిని సకాలంలో అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని రాంరెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు

చేసేందుకు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని అన్నారు. సూర్యాపేట పట్టణ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్‌రెడ్డి, చిలుముల సునీల్‌రెడ్డి, బానోత్ సైదులు, ఆత్మకూర్(ఎస్) మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు రామచంద్రారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకన్న, జమండ్ల సత్యనారాయణరెడ్డి, మొగదాల లక్ష్మణ్‌గౌడ్, నాగునాయక్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం

శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరక

మునుగోడు,13, సెప్టెంబర్, సాక్ష్యం

మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి నల్గొండ జిల్లా ణజజదీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారుఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేస్తూ, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారుఈ కార్యక్రమంలో సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర సంఘం నూతన కమిటీ ఎన్నిక
మండల అధ్యక్షుడిగా కొలిపాక శ్రీను ఏకగ్రీవం

గరిడేపల్లి,సెప్టెంబర్ 13(ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం గరిడేపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మండల కేంద్రంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షులు గొట్టం సంజీవరావు,మాసంపల్లి సైదులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఏడుకొండల వెంకటేశ్వర్లు,జిల్లా కన్వీనర్ సలికంటి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు.మండలంలోని 29 గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసిన అనంతరం,ఆయా గ్రామ కమిటీల ప్రతినిధుల సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొలిపాక శ్రీను,ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి జానకిరాములు, కోశాధికారిగా కొలిపాక కృష్ణ ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా కడారు వెంకటేశ్వర్లు,గుమ్మిడేల్లి రాములు,జానకిరాములు ఎన్నిక కాగా,ప్రచార కార్యదర్శులుగా సలికంటి ప్రసాద్,సలికంటి నరేష్, మధు ఎన్నికయ్యారు.మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా కొలిపాక మంగమ్మ,ప్రధాన కార్యదర్శిగా మడిపడిగా స్వప్న ఎన్నికయ్యారు. యువజన విభాగం అధ్యక్షుడిగా కానుక విజయ్,ప్రధాన కార్యదర్శిగా కోట సతీష్,సహాయ కార్యదర్శులుగా మామిడి వీరబాబు,గుమ్మడిల్లి కరుణాకర్,ప్రచార కార్యదర్శిగా కడారు హరీష్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు

మాట్లాడుతూ కుమ్మరుల సంక్షేమం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. కుమ్మరుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గ్రామ దేవతల వద్ద పూజలు,నైవేద్యాలు నిర్వహించే కుమ్మరులకు నెలసరి గౌరవ వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి,వారి హక్కులు, సంక్షేమ పథకాలు, వృత్తి పరిరక్షణ కోసం సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు.సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కుమ్మర సంఘం నాయకులు, ప్రతినిధులు,సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన మండల కమిటీకి మద్దతు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
ఆలేరు ఎమ్మెల్యే
ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో తెలంగాణ ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య సహకారం తో మట్టి వినాయక విగ్రహాలను ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదివారం అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, చేనేత సహకార సంఘం చైర్మన్ దాసి శంకర్, కౌన్సిలర్లు జూకంటి సంపత్, మార్కు మరియమ్మ, మంతపూరి సర్పంచ్ పసుల సతీష్ రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, కో ఆప్షన్ సభ్యులు చింతకింది మురళి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీ పేరుతో
చట్టసభను అవమానపరిచారు
- ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఆలేరు సెప్టెంబర్ 13 ప్రజా జ్యోతి

వారి నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాడు.. ఆ పార్టీ ఎమ్మెల్యేలు వారి పార్టీ ఆఫీసులో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అవుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బి ఆర్ ఎస్ వ్యవహారశీలి పై విరుచుకుపడ్డారు. ఆదివారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన పిసిసి కార్యదర్శి బొజ్జ సంధ్యారెడ్డి తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తీర్చిదిద్దుతుంటే.. ఓర్వలేని వారు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. 22 ఏ తో సహా అనేక అంశాలను వక్రీకరిస్తున్నారని.. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాదరణను చూసి ఓర్వలేని బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు తమ రాజకీయ ఫెవికాల్ బంధంతో వ్యవహరిస్తున్నాయని ఐలయ్య విమర్శించారు. వీరేమో అసెంబ్లీలో మాట్లాడతారు. వారేమో అసెంబ్లీ వెలుపల మాక్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి తో పాటు స్పీకర్ ను

అవమానపరిచే విధంగా మాట్లాడతారు అంటూ.. తన రాజకీయ ప్రత్యర్థి పార్టీలను ఆయన నిశితంగా విమర్శించారు. వచ్చే 2029 ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓటమి తప్పదని. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాభిమానం చూ రగొంటున్న కాంగ్రెస్ పార్టీదే మళ్లీ విజయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 6,013 కేసుల పరిష్కారం..
- సత్వర న్యాయమే లక్ష్యం..
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి):

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొత్తం 6,013 కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, తెలిపారు.పోలీస్ శాఖ, న్యాయ విభాగం, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ స్థాయిలో కేసుల పరిష్కారం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా చిన్నచిన్న పెండింగ్ కేసులను పరస్పర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కరించడం ద్వారా ప్రజలకు త్వరిత న్యాయం అందడంతో పాటు కోర్టులపై భారం తగ్గుతుందని పేర్కొన్నారు.ప్రజలు భవిష్యత్తులో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, న్యాయవాదులు, సంబంధిత శాఖల ప్రతినిధులను ఆయన అభినందించారు.

నవరాత్రుల్లో గణేశునికి ఏ రోజు ఎలా పూజించాలి?....

- ఏ నైవేద్యం సమర్పించాలి?.... - ఫోటో రైటప్ ఃగణపతిని పూజిస్తున్న భక్తులు

నిడమనూరు,సెప్టెంబర్13(ప్రజాజ్యోతి):

సంప్రదాయంలో ముచ్చటగా మూడు నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటాం. మొదట చైత్రమాసంలో వచ్చే వసంత నవరాత్రులు . రెండోవ భాద్రపదంలో గణపతి నవరాత్రులు, మూడోవ ఆశ్వయుజంలో శరన్నవరాత్రులు. పల్లెపల్లెలో వినాయక నవరాత్రులు వైభవంగా జరుగుతాయి. అయితే ఈ ఉత్సవాలను ఆర్భాటంగా చేయడం కన్నా, శాస్త్రీయంగా నిర్వహించడం వల్ల ఏకదంతుడి అనుగ్రహం లభిస్తుంది.

-నవరాత్రుల విశిష్టత, అర్చనా విధానం పూర్తిగా తెలుసుకోవాలి. ఆ విశేషాలే ఇవి..

మొదటి రోజు భాద్రపద శుద్ధ చవితి వరసిద్ధి వినాయకుడు నైవేద్యం : ఉండ్రాళ్లు ఇంటింటా వినాయక పూజ చేసుకోవాలి. వ్రతకల్పంలో భాగంగా పూజ పూర్తయ్యాక శమంతక ఉపాఖ్యానం వినాలి. చవితినాటి చంద్రుణ్ని చూసినవారికి నీలాపనిందలు కలుగుతాయన్న శాపం నుంచి బయటపడటం కోసం ఈ కథ చదువుకుని అక్షతలు తలమీద వేసుకోవాలి. అక్షతలను మనమే ధరించాలి తప్ప, భగవంతుడిపై వేయకూడదు. ఒక్కరోజు కార్యక్రమం నిర్వహించుకునే వారికి ఈ కథ చాలు. నవరాత్రులు జరిపేవారు మాత్రం మూషికాసుర వృత్తాంతమూ తెలుసుకోవాలి. మూషికాసుర వృత్తాంతం, దండకారణ్యంలో ఒక మహర్షి తన భార్యతో కలిసి నివసించేవాడు. సేద్యం చేసుకుని భుక్తి గడుపుకొంటూ, ముక్తికోసం తపస్సు చేస్తూ ఉండేవాడు. అనింద్యుడనే మూషికరాజు వారి కష్టార్జితమైన పంటను హరిస్తూ ఉంటే భరద్వాజ ముని సూచనపై వినాయక వ్రతం ఆచరించసాగాడు ఆ మహర్షి. ఉద్యాపన చేస్తుండగా ఆ నివేదనలను కూడా అనింద్యుడు హరించడంతో అసురుడవై జన్మించమని రుషిపత్ని శపిస్తుంది. విఘ్నేశ్వరుడి ప్రసాదం స్వీకరించిన ఫలితంగా ముందుగా అనింద్యుడు యక్షరాజైన కుబేరునికి కుమారుడిగా పుట్టాడు. ఒకసారి తండ్రితోపాటు మణిద్వీపానికి వెళ్లాడు.అక్కడ జగన్మాత సమక్షంలో ఉన్న సువర్ణపాత్రలోని జ్ఞానామృతాన్ని మూషికంగా మారి ఆస్వాదించాడు. జగన్మాత కోపగించి, "మూషికాసురునిగా అసురజన్మ ఎత్తుదువు గాక!" అని శపిస్తుంది. "కామక్రోధాది అష్టదుష్ట శక్తులను అంతం చేసినవానికి నీవు దాసుడవవుతావ"ని కూడా పలికింది. అలా గణపతి దుష్టశక్తులను అణచి మూషికుని దాసుని చేసుకున్న కథే గణపతి నవరాత్రుల వృత్తాంతం.

-రెండోవ రోజుభాద్రపద శుద్ధ పంచమి వికట వినాయకుడునైవేద్యం : అటుకులు

'లంబోదరశ్చ వికటో' అని వినాయకుడి షోడశ నామాలలో ఆయనను స్మరిస్తాం. స్వామిని వికట వినాయకునిగా ఆవాహన చేసి, మొదటిరోజున పూజించినట్లే పూజించాలి. రెండోవ రోజున చదువుకోవాల్సిన కథాంశం పరమశివుడి కోపానికి గురైన మన్మథుడు, ముక్కంటి అగ్నికి ఆహుతి అవుతాడు. అలా కామున్ని భస్మం చేయగా మిగిలిన రుద్రనేత్రాగ్ని సముద్రంలో పడింది. ఆ అగ్నినుంచి పుట్టినవాడే జలంధరుడు. శివుడి వల్ల తప్ప వేరొకరి చేత అతనికి మరణం లేదని బ్రహ్మదేవుడు చెప్పాడు. కాలనేమి అనేవాడు తన పుత్రిక బృందను జలంధరునికి ఇచ్చి వివాహం చేశాడు. వారి కుమారుడు కామాసురుడు మహిషాసురుని పుత్రిక తృష్ణను వివాహం చేసుకుంటాడు. ఆ అసురుడుడ శివుడి కోసం భీకరమైన తపస్సు చేస్తాడు. అజేయత్వం, నిర్భయత్వం, మృత్యుంజయత్వమనే వరాలను పొందుతాడు. మూషికాసురునికి ఆత్మీయుడై విజృంభించ సాగాడు. అలా లోకమంతా కామాధీనమయింది. దేవతలు, మునులు ముద్గల మహర్షిని ఆశ్రయించి, ఆయన సూచనమేరకు వికట వినాయకుడిని భక్తిశ్రద్ధలతో సేవించారు. ఆయన నుంచి అభయం పొందారు. తాను చెరబట్టిన చిత్రాంగిని రక్షించాడని మూషికాసురుడు గణపతిపై అప్పటికే కక్షగట్టి ఉన్నాడు. అందువల్ల మూషికాసురుడు తనవిరోధి వినాయకుడి మీదికి కామాసురుని పురిగొల్పాడు. కామాసురుడు మయూరరూపం ధరించి, లోకమంతటినీ కామంతో ప్రభావితం చేస్తూ గణపతిని కూడా లొంగదీసుకోవడానికి ప్రయత్నించాడు. గణపతి ఆ మయూరాన్ని అణచివేసి దానిని అధిరోహించాడు. నెమలిపై విహరిస్తున్న స్వామిని చూసి దేవతలు, మునులు, 'మయూరవాహనా! వికట వినాయకా!' అని స్తుతించారు. అటుకులు నివేదించి స్వామిని తృప్తి పరిచారు. రెండోనాటి పూజ ద్వారా సమాజం దుష్ట కామాన్ని వీడాలి.

-మూడోవ రోజు భాద్రపద శుద్ధ షష్ఠి లంబోదర వినాయకుడునివేదన: పేలాలు

క్రోధాసురుణ్ని వధించిన లంబోదరుడిని మూడోనాడు షోడశోపచారాలతోనూ, అష్టోత్తర శతనామావళితో గానీ, సహస్ర నామావళితోనూ పూజించాలి. సముద్ర మథనంలో లభించిన అమృతాన్ని లోక కంటకులైన రాక్షసులకు అందనీయకుండా దేవతలకు అందించడం కోసం శ్రీమన్నారాయణుడు మోహినీ రూపం ధరించాడు. శివుడు ఆమె మోహంలో పడి వెంటాడగా, మోహిని శివుడిని వంచించి మాయమైంది. 'కామాత్ క్రోధో అభిజాయతే' అన్నట్లుగా కామం తీరని శివుడు క్రోధావిష్టుడు అయ్యాడు. మోహిని వల్ల తమకం కారణంగా వీర్యస్ఖలనమై దుష్ప్రదేశంలో పడింది. దానినుంచి ఉద్భవించినవాడే క్రోధాసురుడు. శుక్రాచార్యుని నుంచి సూర్యమంత్రం పొంది ఘోరమైన తపస్సు చేశాడు. ముల్లోకాలనూ జయించే శక్తిని, మృత్యురాహిత్యాన్ని, లోకప్రసిద్ధిని వరాలుగా పొందాడు. ఆవేశపురిని రాజధానిగా చేసుకున్నాడు. అతని భార్య ప్రీతి. క్రోధాసురుడు కూడా మూషికాసురునికి సన్నిహితుడై లోకాలను పీడించసాగాడు. దాంతో దేవతలు, మునులు లంబోదరుడిని ఆశ్రయించగా, ఆయన క్రోధాసురుని పీచమణచాడు. క్రోధాసురుడు లంబోదరుడిని శరణువేడాడు. ఆయన అనుగ్రహించాడు. దుష్టశిక్షణాదులందు తప్ప నీవు లోకంలోకి రావద్దని ఆదేశించి, క్రోధుని తన నేత్రాల్లో ఇమిడి పొమ్మన్నాడు. ఈ క్రోధుని కారణంగా ప్రజలు కార్యాకార్య విచక్షణ కోల్పోతారు. కాబట్టి ఎవ్వరూ వాని ప్రభావానికి లోను కావద్దని లంబోదర గణపతి మనుషులను హెచ్చరించాడు. ఈనాటి పూజతో భక్తులు క్రోధాన్ని విడిచిపెట్టడం కర్తవ్యం.

-నాల్గోవ రోజు భాద్రపద శుద్ధ సప్తమి గజానన వినాయకుడు నివేదన: చెరకుగడలు

నవరాత్రుల నాలుగోరోజున గణ పతిని గజానన వినాయకుడిగా పూజించాలి. లోభాంతకుడయిన గజాననుడికి చెరకుగడ నివేదన చేయాలి. విశ్రవబ్రహ్మ కుమారుడైన కుబేరుడు తన మారుసోదరుడైన రావణాసురుడి కారణంగా లంకకు దూరమవుతాడు. తండ్రి సూచన మేరకు కైలాసానికి వెళ్తాడు కుబేరుడు. అక్కడ పార్వతీదేవి సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. మనసు చెదిరి, చూపుల్లో చాంచల్యం ఏర్పడుతుంది. కుబేరుడి మనోవికారాన్ని గుర్తించిన పార్వతి కోపంగా చూడటంతో అతని ఒక కన్ను మాడిపోతుంది. ఆ కంటి బూడిద నుంచి పుట్టినవాడే లోభాసురుడు. అతను లోభాసురుడు శివుడి గురించి తీవ్రమైన తపస్సు చేసి అజేయ వరాలు పొందుతాడు. లాలస అనే కన్యను వివాహమాడతాడు. దుష్టబుద్ధితో మునిగణాన్ని పీడిస్తే వారు రైభ్యుడనే మునిని ఆశ్రయిస్తారు. ఆయన గజానన వినాయకుడిని ప్రార్థించమన్నాడు. వారు అలా చేయగా గజాననుడు అనుగ్రహిస్తాడు. శివ, శుక్రాచార్యుల చేత తనను గురించి ఆ రాక్షసుడికి చెప్పిస్తాడు. దాంతో లోభాసురుడు గజాననుడి శరణు వేడాడు. గజానన వినాయకుడు లోభుడిని పాతాళానికి పొమ్మని ఆదేశిస్తాడు. ధర్మవిరుద్ధం కాని లోభం ప్రమాదకారి కాదని భక్తులకు వివరించాడు. ఈనాటి గజానన వినాయకుడి పూజకు పరిపూర్ణత లోభం విడిచిపెట్టడమే.

-ఐదోవ రోజుభాద్రపద శుద్ధ అష్టమిమహోదర వినాయకుడు నివేదన: కొబ్బరి కురిడి

మహాగణపతిని జయించడం కోసం మూషికాసురుడు అనేకమైన ఉపాయాలు పన్నుతాడు. శుక్రాచార్యునికి మోహాసురుడనే ప్రియశిష్యుడు ఉండేవాడు. గురువు అతనికి సూర్యోపాసన విధానం తెలిపి, మహాశక్తిమంతుడిని చేశాడు. అతను మదిర అనే రాక్షసకన్యను పెండ్లాడతాడు. మూషికాసురుడు మోహాసురుణ్ని గణపతితో యుద్ధం చేయడానికి ప్రేరేపిస్తాడు. ముందుగా తన చెరనుంచి గంధర్వ వనిత చిత్రాంగిని విడిపించినందువల్ల ఆ గంధర్వలోకాన్ని మోహంలో ముంచేయాల్సిందిగా చెబుతాడు. మోహాసురుడు అలాగే చేస్తాడు. ఇదంతా గమనించిన చిత్రాంగదుడు అనే గంధర్వరాజు దీనికంతటికీ మూలకారణం మూషికాసురుడే అని గ్రహిస్తాడు. సాటి గంధర్వులతో ప్రవాళ క్షేత్రానికి వెళ్లి, ప్రవాళ గణపతిని పూజిస్తాడు. గణపతి వారందరికీ ధైర్యం చెప్పి తన మాయాశక్తితో మోహాసురుడి ముందు నిలిచాడు. భ్రాంతి తొలగిన మోహాసురుడు మహోదర గణపతి పాదాలపై పడతాడు. నన్ను నీలో కలుపుకోవాల్సిందని వేడుకుంటాడు. అతని కోరికను మన్నించిన గణపతి మోహాసురునిపై దివ్యాస్త్ర ప్రయోగం చేయడంతో అతనిలో మోహం అంతమవుతుంది. ఆ రాక్షసుని దేహం నుంచి జ్యోతి వెలువడి మహోదర గణపతిలో చేరుతుంది. కాబట్టి అయిదోనాటి పూజ పరమార్థం మోహాన్ని వీడి సద్గతికి అర్హులం కావడమే.

-ఆరోవ రోజుభాద్రపద శుద్ధ నవమిఏకదంత వినాయకుడునివేదన: నువ్వులు/ నువ్వులతో చేసిన పదార్థాలు

పూర్వం చ్యవన మహర్షికి మదం ఆవహించింది. ఆ దుష్టభావం నుంచి మదాసురుడు ఉద్భవించాడు. అతను శుక్రాచార్యుడి నుంచి మంత్రోపదేశం పొంది అమ్మవారిని గురించి తపస్సు చేశాడు. ఆమె ఇచ్చిన వరాల బలంతో మరింత మదోన్మత్తుడు అయ్యాడు. ప్రమదాసురుని కుమార్తె లాలసను పెండ్లాడతాడు. లోకకంటకుడై విజృంభించసాగాడు. అప్పుడు సనత్కుమారుడు చేసిన సూచనతో ఏకదంత గణపతిని ఆశ్రయిస్తారు మునులు. అదే సమయంలో మూషికాసురుడు గణాధిపతిని ఎదుర్కొన్నాడు. దేవతలు, రుషులకు అభయమిచ్చి ఏకదంతుడు సింహ వాహనాన్ని అధిరోహిస్తాడు. మదాసురునితో పోరుకు నిలిచాడు. సింహం ఆ అసురునిపై లంఘించి, వాడి గొంతును నోట కరుచుకుంటుంది. ఏకదంతుడు తన పాదాన్ని అసురుడి గుండెపై మోపాడు. ఆ పాదస్పర్శతో మదాసురుడి మదం అణగి ఏకదంత గణపతిని శరణువేడాడు. గణపతి వాడికి అభయమిచ్చి, ధర్మ విరుద్ధంగా ప్రవర్తించవద్దని బుద్ధిచెప్పి, పాతాళానికి పంపుతాడు. నేటిపూజకు పరిపూర్ణత మనలోని మదాన్ని విడిచిపెట్టడమే.

-ఏడోవ రోజు భాద్రపద శుద్ధ దశమి వక్రతుండ వినాయకుడు నివేదన: అరటి మొదలైన పండ్లు

ఒకప్పుడు దేవేంద్రుడికి విపరీతమైన ఆవులింత వచ్చింది. దానినుంచి మత్సరుడనే రాక్షసుడు జన్మించాడు. అతను శుక్రాచార్యుడి నుంచి శివమంత్రం పొంది, తపస్సు చేసి వరాలు పొందుతాడు. వరగర్వంతో లోకవిజేత కావాలని యత్నిస్తాడు. ఈర్ష్య అనే రాక్షసకన్యను వివాహమాడి విషయప్రియుడు, సుందరప్రియుడు అనే పుత్రులకు జన్మనిస్తాడు. మత్సరాసురుని బాధలు భరించలేక దేవతలు, రుషులు దత్తాత్రేయ స్వామిని ఆశ్రయించారు. ఆయన వారికి ఏకాక్షర గణపతి మంత్రాన్ని ఉపదేశించి ధైర్యం చెప్పాడు. వారంతా ఆ మంత్రాన్ని నిష్ఠగా జపించారు. మూషికాసురుడు మత్సరాసురుడిని గణపతిపై పోరుకు ప్రోత్సహిస్తాడు. ఆ అసురుడు సింహరూపం పొంది, గణపతి మీదికి దూకగా వినాయకుడు తన దేహాన్ని విపరీతంగా పెంచాడు. తన తొండంతో మత్సర సింహాన్ని చుట్టి ఎత్తి గిరగిరా తిప్పి నేలకు కొట్టేంతలో ఆ అసురుడు గణపతిని శరణు వేడుతాడు. వక్రతుండ గణపతి కనికరించి, ఆ మత్సర సింహాన్ని నేలకు జార్చి దానిని వాహనంగా చేసుకున్నాడు. నేటి పూజకు పరిపూర్ణత మాత్సర్య గుణాన్ని వీడటమే.

గ్రామ స్వరాజ్యానికి కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం!

- పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి..

ఆర్థిక స్వేచ్ఛతో అభివృద్ధికి బాటలు

- తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు:

సర్పంచ్ దున్నా శ్రీనివాస్

నడిగూడెం, సెప్టెంబర్ 13, ప్రజా జ్యోతి:

గ్రామపంచాయతీలకు స్వయం ప్రతిపత్తి, ఆర్థిక స్వేచ్ఛ కల్పించే విధంగా శాసనసభలో బిల్లు ఆమోదం పొందడం పట్ల నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఆదివారం మండల కేంద్రంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. బిల్లును ఆమోదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రిమండలి సభ్యులు, శాసనసభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామపంచాయతీలకు స్వయం ప్రతిపత్తి, ఆర్థిక స్వేచ్ఛ కల్పించడం ద్వారా అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని తెలిపారు.రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల సహకారంతో నడిగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సర్పంచ్ దున్నా శ్రీనివాస్ వెల్లడించారు.

ప్రపంచ శాంతి, దేశ సమైక్యత కోసం 'ఇస్కాఫ్' కృషి..

- రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు

నల్గొండ సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి):

భారతీయ సంస్కృతిని, కళలను ప్రపంచవ్యాప్తంగా. విస్తృత పర్చేందుకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) కృషి చేస్తుందని హైకోర్టు న్యాయవాది, ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కడారు ప్రభాకర్ రావు పేర్కొన్నారు. ఆదివారం నల్గొండ లోని ఐఎంఏ హాల్లో ఇస్కఫ్ నల్గొండ జిల్లా మహాసభలు డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సైతం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంకులలో తగిన స్థానం కోరటం సహితమైనది కాదన్నారు. గత 80 సంవత్సరాలుగా ఇస్కాఫ్ దేశ సమైక్యత, సమగ్రత కోసం కృషి చేస్తుందన్నారు. ఇటీవల వెనుజుల అధ్యక్షులు మదురోని అక్రమంగా అమెరికా సైన్యం అరెస్టు చేసి న్యూయార్క్ జైల్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఐ ఏ ఎల్ రాష్ట్ర నాయకులు, ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్ పై అకారణంగా అమెరికా యుద్ధం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయంగా ప్రపంచ దేశాల శాంతి అలీన ఉద్యమ బలోపేతం, పాలస్తీనా, ఇరాక్ సరిహద్దు వివాదాల వంటి వాటిపై ఇస్కాఫ్ పోరాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు కారింగు బిక్షమయ్య, కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి ,న్యాయవాదులు ముసగాల నారాయణరావు, గుండె వెంకటేశ్వర్లు, కట్ట అనంతరెడ్డి, కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్ రమేష్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ఇస్కాఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఏ సి హెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, కోశాధికారిగా బి రామలింగం లతో పాటు 35 మందితో జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

హుజూర్ నగర్, సెప్టెంబర్ 13: (ప్రజా జ్యోతి)

జర్నలిస్టులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం పట్టణంలోని వర్తక సంఘం భవన్‌లో వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలాలను క్రమబద్ధీకరించి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డుల సక్రమ అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో ఐజేయూ ప్రతినిధులు శ్రీనివాస చారి, రాంప్రసాద్, రామనాథం, ఇందిరాల రామకృష్ణ, అంజయ్య వెంకటరెడ్డి, రాజు 143 యూనియన్ ప్రతినిధులు దుగ్గి ఉషశ్రీ,ఎలక్ట్రాన్ మీడియా అధ్యక్షులు రాజా రమేష్,నాగరాజు, రమేష్ రెడ్డి క్రాంతి డి. శ్రీనివాస్ మధు, వెంకటేష్, నరేష్ ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు..

సాగర్ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సిందే..

- రైతుల కోసం పేగులు తెగే వరకు పోరాడుతాం..
- నీటి దోపిడీపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం..
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి.

నల్గొండ సెప్టెంబర్ 13,(ప్రజా జ్యోతి):

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాల్సిందేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. రైతులు పూర్తి స్థాయిలో నాట్లు వేసుకోవాలని, నీటి కోసం భారత రాష్ట్ర సమితి ఎంతవరకైనా పోరాడుతుందని స్పష్టం చేశారు.నల్గొండ జిల్లా భారత రాష్ట్ర సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎడమ కాల్వ, వరద కాల్వ, ఏఎంఆర్పీ, లో లెవల్ కాల్వ, ఎస్ఎల్బీసీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వెంటనే సాగర్ నుంచి నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించి, ఎడమ కాల్వకు ఎంతకాలం నీరు అందిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు.శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో తెలంగాణకు చెందిన రెండు వందల టీఎంసీల నీటిపై రాష్ట్రానికి హక్కు ఉందని పేర్కొన్నారు. పొతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా జరుగుతున్న నీటి తరలింపుపై కృష్ణా నది యాజమాన్య మండలికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కనీసం లేఖ కూడా రాయకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు.ఎడమ కాల్వకు నీటి విడుదల షెడ్యూల్ ప్రకటించకపోతే కేటీఆర్ నాయకత్వంలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. రైతుల సమస్య ఎక్కడ ఉంటే అక్కడ భారత రాష్ట్ర సమితి పోరాడుతుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆరోపించారు. సాగునీటి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తమ హయాంలో ఉదయ సముద్రం జలాశయాన్ని కళకళలాడేలా చేశామని, ప్రస్తుతం పరిస్థితి దిగజారిందని అన్నారు. తెలంగాణ రైతుల హక్కైన నీటిని సాధించే వరకు కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.

తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా సాముల రామ్‌రెడ్డి

హుజూర్ నగర్ సెప్టెంబర్ 13: (ప్రజా జ్యోతి)

తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా సాముల రామ్ రెడ్డి ఆదివారం ఎన్నికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలుగా చైర్మన్‌గా కొనసాగిన ఏ. నర్సింహారెడ్డి స్థానంలో రామ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూడు దశాబ్దాల పాటు పనిచేశారు. జనవరి 30 న జరిగిన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో సభ్యుడిగా గెలుపొందారు.26 మంది బార్ కౌన్సిల్ సభ్యులు ఉండగా, చైర్మన్ పదవికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు.చైర్మన్ గా హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన సాముల రాంరెడ్డి ఘన విజయాన్ని సాధించారు.హుజూర్ నగర్ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా ఈ ప్రాంతం నుంచి రాంరెడ్డి తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా పోటీ చేసి విజయం సాధించడం పట్ల ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్ల సభ్యులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల బార్ అసోసియేషన్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల వలయంలో కస్తూర్బా!

- బాలికలకు తాగునీటి కష్టాలు.. భోజనంపైనా ఫిర్యాదులు- రెండు బోర్లు చెడిపోయాయి..
మిషన్ భగీరథ నీటిపైనే ఆధారం - నాలుగు రోజులుగా వంట కార్మికులు గైర్హాజరు.. ప్రైవేట్ వ్యక్తులతో వంట
- పేరెంట్స్ మీటింగ్‌లో వెలుగులోకి వచ్చిన విద్యార్థినుల ఇబ్బందులు

మల్లేపల్లి, సెప్టెంబర్ 13,(ప్రజాజ్యోతి):

మండల పరిధిలోని కోలు ముంతలపాడు గ్రామపంచాయతీలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమస్యలు విద్యార్థినులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే ఫిర్యాదులు వెలువడ్డాయి. తాగునీటి సమస్యతో పాటు భోజనం విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆదివారం నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో విద్యార్థినులు తమ సమస్యలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు. హాస్టల్‌లో సరిపడా నీరు అందుబాటులో ఉండటం లేదని, భోజనం కూడా సక్రమంగా అందడం లేదని పిల్లలు చెప్పినట్లు వారు పేర్కొన్నారు. చాలీచాలని ఆహారం అందుతున్నట్లు విద్యార్థినులు చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.తమ సమస్యలను బయటకు చెప్పుకుంటే పాఠశాల సిబ్బంది భయపెడుతున్నారని కొందరు విద్యార్థినులు చెప్పినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో పిల్లలు తమ ఇబ్బందులను బయటకు చెప్పుకోలేక మౌనంగా భరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా

ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా, నాలుగు రోజులుగా వంట కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో బయట నుంచి ప్రైవేట్ వ్యక్తులను తీసుకువచ్చి వంట చేయిస్తున్నామని తెలిపారు. వంట కార్మికుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.పాఠశాలలో ఉన్న రెండు బోర్లు చెడిపోవడంతో ప్రస్తుతం నీటి లభ్యత లేక అన్ని అవసరాలకు మిషన్ భగీరథ నీటినే వినియోగిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. అయితే కొన్ని సందర్భాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే పాఠశాలలో కూడా నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు.

అధికారుల పర్యవేక్షణ ఎప్పుడు?

కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న బాలికలకు తాగునీరు, నాణ్యమైన భోజనం, వసతి వంటి కనీస సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. బోర్లను వెంటనే మరమ్మతు

చేయడంతో పాటు ప్రత్యామ్నాయ నీటి సదుపాయం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.అలాగే వంట కార్మికుల కొరతకు శాశ్వత పరిష్కారం చూపి విద్యార్థినులకు సమయానికి, సరిపడా భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థినుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ప్రిన్సిపాల్ ఇచ్చిన వివరణ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. బాలికల సంక్షేమానికి సంబంధించిన అంశం కావడంతో అధికారులు ఎంత త్వరగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.